క్లుప్తంగా

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



సరస్వతీ పూజా కార్యక్రమంలో విద్యార్థులు

బంగారుపాళెం: మండలంలో కోలావారి ఊరు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వార్షికోత్సవాన్ని ఉపాధ్యాయుడు జగదీష్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. చదువుల తల్లి సరస్వతిదేవి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ప్రదర్శించారు.

మూడు నామినేషన్లు దాఖలు

పూతలపట్టు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శుక్రవారం పూతలపట్టు ఆర్వో కార్యాలయంలో మూడు నామినేషన్లు దాఖలైనట్లు ఆర్వో చిన్నయ్య తెలిపారు. వైఎస్సార్‌సీపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ రెండు నామినేషన్లు దాఖలు చేయగా, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళిమోహన్ ఒక నామినేషన్ దాఖలు చేసినట్లు చెప్పారు ప్రశాంతంగా, శాంతియుతంగా రెండో రోజు నామినేషన్ల ప్రక్రియ సాగిందని ఆయన వెల్లడించారు.

నేడు పట్నంలో ప్రచారం

తవణంపల్లె: మండలంలోని పట్నం పంచాయతీలో శనివారం ఉదయం 6 గంటలకు పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పార్టీ మండల అధ్యక్షులు హరిరెడ్డి తెలిపారు.

కొదలమడుగు చెక్‌పోస్టు తనిఖీ



చెక్‌పోస్టులో రికార్డులు పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు రోహన్ ఠాకూర్

బంగారుపాళెం: మండలంలోని కొదలమడుగు చెక్ పోస్టును శుక్రవారం పూతలపట్టు ఎన్నికల వ్యయ పరిశీలకులు రోహన్‌ఠాకూర్ తనిఖీ చేశారు. చెక్ పోస్టులో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర సరిహద్దులో గల చెక్ పోస్టుల్లో పటిష్టమైన నిఘా పెట్టాలని అధికారులకు సూచించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అక్రమంగా మద్యం, నగదు తరలించే అవకాశం ఉండడంతో తనిఖీలు పారదర్శకంగా చేయాలని ఆదేశించారు. ఎంపిడిఓ శివశంకర్, ఎఫ్ఎస్‌టి టీం సభ్యులు పాల్గొన్నారు.

ఈ ఎన్నికల్లో టీడీపీని ఓడిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చిత్తూరు: కూటమి కట్టిన టీడీపీని ఓడిద్దామని వీకేసీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గణపతి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ జాతీయ అధ్యక్షులు తిరువన వేలన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో పోటీ చేయనున్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లాలో ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితా నేడు విడుదల చేయనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు బాలకష్ణ, విజయకుమార్, దేవా, గోవిందప్ప, సంతోష్, ఏసు, మాధవి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



ఉత్తర బ్రాహ్మణపల్లెలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

తవణంపల్లె: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని స్థానిక హైస్కూల్ హెచ్ఎం శ్రీరంజని తెలిపారు. మండలంలోని ఉత్తరబ్రాహ్మణపల్లె, వడ్డిపల్లె, దిగువ అరుంధతివాడ, మిట్టపల్లె గ్రామాల్లో తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి మాట్లాడారు. తవణంపల్లె హైస్కూల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రారంభమవుతుందని వివరించారు. 3వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు తవణంపల్లె హైస్కూల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఈ విద్యాసంవత్సరం నుంచి 10వ తరగతి పాసైన వారు తవణంపల్లె హైస్కూల్లో ఇంటర్మీడియట్‌లో చేరే అవకాశం కలిగిందన్నారు. దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌళిక వసతులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవరాజులురెడ్డి, విజయకృష్ణారెడ్డి, జనార్ధన్‌నాయుడు, షణ్ముగసుందరం, సురేంద్రనాథరెడ్డి, కృష్ణారెడ్డి, లవకుమార్, ఢిల్లీప్రసాద్, భాస్కర్ పాల్గొన్నారు.

అట్టహాసంగా నామినేషన్

- నామినేషన్ సమర్పించిన వైఎస్సార్‌సీపీ పూతలపట్టు అభ్యర్థి సునీల్‌కుమార్
- జనజాతరలా సాగిన ర్యాలీ
- ఆకట్టుకున్న మహిళల డాన్స్



వైఎస్సార్‌సీపీ శ్రేణుల ర్యాలీ, (ఇన్‌సెట్) అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్, ఎంపీ రెడ్డెప్ప

పూతలపట్టు/చిత్తూరు రూరల్: పూతలపట్టు మండల కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సునీల్‌కుమార్ అట్టహాసంగా నామినేషన్ వేశారు. దీనికి నియోజకవర్గ నలుమూలల నుంచి భారీగా జనం తరలివచ్చారు. ఈ నామినేషన్ దాఖలుకు ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పతోపాటు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు. నామినేషన్‌కు ముందుగా సునీల్‌కుమార్ కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకున్నారు. ఎం.పైపల్లెలోని కులదేవతకు ప్రత్యేక పూజలు చేసి వేడుకున్నారు. అనంతరం పూతలపట్టు కాణిపాకం ఆర్చి వద్ద నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. సునీల్‌కుమార్ ప్రచార వాహనంపై అభివాదం చేస్తూ ర్యాలీని ముందుకు సాగించారు. మార్గమధ్యంలో నాయకులు క్రేన్ ద్వారా గజమాలతో సత్కరించారు. ర్యాలీ అంబేడ్కర్ సర్కిల్ వరకు కొనసాగింది. మధ్యాహ్నం 12.07 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో సునీల్‌కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. ఆ పత్రాన్ని ఆర్ఓ చిన్నయ్యకు అందజేశారు. ర్యాలీలో డప్పు వాయిద్యాలకు అనుగుణంగా మహిళలు దారిపొడవునా డాన్స్ చేశారు. వృద్ధులు సైతం డాన్స్ చేస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పార్టీ జెండాలతో జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. ఐరాల మండలానికి చెందిన అవిష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వంద అడుగుల పార్టీ జెండా ర్యాలీ ఆకట్టుకుంది. అడుగడుగునా పోలీసులు పూర్తి స్థాయిలో నిఘా పెట్టారు. పటిష్ట బందోబస్తు కల్పించారు. నామినేషన్ నిర్వహణ, బందోబస్తును ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు.

ఫ్యాన్ స్పీడుకు తట్టుకోలేరు

ఫ్యాన్ స్పీడుకు ప్రతిపక్షం తట్టుకోలేదని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ అన్నారు. నామినేషన్‌లో భాగంగా ఆయన ప్రజలను ఉద్దేశించి కాసేపు మాట్లాడారు. ఫ్యాన్ స్పీడుకు ప్రతిపక్షం పంక్చర్ అవ్వడం ఖాయమన్నారు. జరగబోవు సంగ్రామంలో కూటమిని కూల్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో బాబు ఓటమి తథ్యమన్నారు. ప్రజలంతా ఏకమై వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామని, జగనన్నను ముఖ్యమంత్రి చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మోహన్‌రెడ్డి, శైలజా చరణ్ రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, పాలఏకరి చైర్మన్ కుమార్‌రాజా పార్టీ కన్వీనర్లు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, హరిరెడ్డి, రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీలు దేవిక, సోమశేఖర్, సుచిత్ర, భారతి, ఎంపీపీ అమరావతి, కుమారి, సురేష్ బాబు, గీతా, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, ద్వారకనాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, నాయకులు రాజారత్నంరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, సర్పంచ్ మాసిలామణి పాల్గొన్నారు.



ర్యాలీలో డాన్స్ చేస్తున్న మహిళలు, వృద్ధులు





వంద అడుగుల పార్టీ జెండాతో ర్యాలీ, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్‌ను గజమాలతో సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం సంబంధించి కార్పొరేషన్ పరిధిలో నిర్దేశించుకున్న రూట్ మ్యాప్ ప్రకారం పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను ఏఆర్వో, కమిషనర్ అరుణ శుక్రవారం పరిశీలించారు. పీవీకేఎన్ కళాశాల నుంచి 22 పోలింగ్ కేంద్రాలను సంబంధిత సెక్టోరల్ అధికారులు, రూట్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. సంతపేట ప్రాంతంలోని 10 పోలింగ్ కేంద్రాలు, కట్టమంచి, దొడ్డిపల్లి, మురుకంబట్టు ప్రాంతాల్లోని 12 పోలింగ్ కేంద్రాలకు వెళ్లే మార్గాలను, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను ఆమె పరిశీలించారు. ప్రధానంగా నిర్దేశించిన మార్గాల్లో పోలింగ్ సామగ్రి తీసుకెళ్లే వాహనాలు సులభంగా వెళ్లగలుగుతాయా లేదా, ఏదైనా రోడ్డుపై వ్యర్థాలు ఉన్నాయా అని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, మరుగుదొడ్లు, నీటి సరఫరా, ఫర్నిచర్, ర్యాంపులు, ఇంటర్నెట్ సదుపాయాలను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల లోపల, బయట పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, నిర్దేశించిన మార్గాల్లో ఆటంకాలు లేకుండా రోజూ పర్యవేక్షించాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఏసీపీ రామకృష్ణుడు, మునిసిపల్ ఇంజనీరు గోమతి, ప్రజారోగ్య అధికారి డా.అనిల్ కుమార్ నాయక్, డీఈ వెంకట ప్రసాద్, ఎంసీసీ, ఎఫ్ఎస్టీ బృందాల అధికారులు, ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగాల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీకి ఇప్పుడు గుర్తొచ్చామా..?



మాట్లాడుతున్న చంద్రశేఖర్, కాశీనాయకర్

చిత్తూరు కార్పొరేషన్: టీడీపీకి వన్నె కులస్తులు ఇప్పుడు గుర్తొచ్చారా అని డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, వన్నె కుల సంఘం జిల్లా అధ్యక్షుడు కాశీనాయకర్ ప్రశ్నించారు. చిత్తూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇటీవల చిత్తూరు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్, ఆ పార్టీ పార్లమెంటరీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ వన్నె కులస్తుల భవన నిర్మాణంపై హామీ ఇస్తూ నిర్వహించిన సమావేశాన్ని ఖండించారు. జిల్లాలో భరత్, సిపాయి సుబ్రమణ్యంకు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. వన్నె కులస్తుల కలగా ఉన్న కమ్యూనిటీ భవనం ఏర్పాటు విజయానందరెడ్డితో సాధ్యమైందన్నారు. భవన్ నిర్మాణానికి ఆయన రూ.20 లక్షలు విరాళంగా ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం అక్కడ నిర్మాణ పనులు సాగుతున్నాయని స్పష్టం చేశారు. దీనిపై వన్నె కుల సంఘం 11 సార్లు వినతి పత్రాలు అందించినా అప్పటి సీఎం చంద్రబాబు పట్టించుకోలేదని గుర్తుచేశారు. స్థానికంగా భవన నిర్మాణ పనులు జరుగుతున్నప్పుడు ఇలాంటి హామీలు ఇచ్చి అలజడి సృష్టించడానికి యత్నిస్తున్నారని చెప్పారు. నిజంగా టీడీపీకి అంత ప్రేమ ఉంటే ఇంత వరకు ఒక నామినేట్ పదవి కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసిన తమ మద్దతు వైఎస్సార్‌సీకే ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో నాయకులు కన్నన్, కెప్టెన్ శివ, రాజేంద్ర, కుమార్, పిచ్చాండి, వేలు, ఆర్ముగం,దీపక్, కర్ణ, దేవా పాల్గొన్నారు.

పేదల గుండెల్లో కొలువైన జగన్



సంతపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి, వైఎస్సార్ సీపీ శ్రేణులు

చిత్తూరు కార్పొరేషన్: అందరికీ మంచి చేసే జగనన్నకు ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం ఉందని వైఎస్సార్ సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి తెలిపారు. సంతపేటలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో వచ్చాక రాష్ట్రంలో ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టి చరిత్రలో నిలిచిపోయే పాలన అందించారన్నారు. జగన్ పాలనలో ఎంత మంచి జరిగిందో, ప్రజలు ఎంత మేలు పొందారో ఆ ఫలాలు పొందిన వారికి తెలుసని చెప్పారు. రైతులు, మహిళలు, విద్యార్థులు ఇలా ఏ వర్గం వారిని అడిగినా జగనన్న గొప్పతనం గురించి తడుముకోకుండా చెబుతాతున్నారని తెలిపారు. మంచి చేసే ప్రభుత్వానికి, నాయకులకు ప్రజలు ఎప్పుడూ అండగా ఉంటారని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా రెడ్డెప్పకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానికంగా డివిజన్ల వారీగా ఉన్న సమస్యలను పరిష్కారిస్తానని హామీనిచ్చారు. సంతపేటలో ఉన్న సమస్యలు తెలుసుకున్నానని చెప్పారు. మౌలిక వసతులకు పెద్దపీట వేస్తానని హామీ ఇచ్చారు. ప్రతివీధిలో కాలువ, సిమెంటు రోడ్డును నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. స్థానికంగా ఉండే చిన్న చిన్న సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. సంతపేట అభివృద్ధిపై తనకు ప్రణాళిక ఉందని వాటిని తీర్చడానికి ప్రజలు ఎన్నికల్లో ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, నాయకులు జ్ఞానజగదీష్, కార్పొరేటర్లు, నాయకులు శారద, రెడ్డెప్ప, రేఖ, సహదేవన్, నారాయణ, ద్వారక తదితరులు పాల్గొన్నారు.

మంత్రిపై విమర్శలు అర్థరహితం

చిత్తూరు కార్పొరేషన్: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శలు అర్థరహితమని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు హేమంత్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీలు మారడం ఆయనకు అలవాటుగా మారిందన్నారు. అన్ని పార్టీలు జత కట్టి కూటమిగా ఏర్పడినా వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

జనారణ్యంలోకి జింక

చిత్తూరు కార్పొరేషన్: జనారణ్యంలోకి జింక వచ్చిన సంఘటన శుక్రవారం చోటుచేసుకున్నది. స్థానిక సత్యనారాయణపురం అటవీ ప్రాంతం నుంచి జనావాసంలోకి జింక వచ్చింది. దీంతో స్థానికులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని జింకను చాకచాక్యంగా పట్టుకున్నారు. అనంతరం జీపులో దానిని తీసుకెళ్లి సురక్షిత అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.



జింకను తీసుకెళుతున్న అటవీ సిబ్బంది

అన్నదాతను ఆదుకునేవారినే ఎన్నుకుంటాం

సాక్షి నెట్‌వర్క్: వ్యవసాయాన్ని పండగలా మార్చి రైతుకు భరోసా ఇచ్చేవారే మా నాయకుడు. ఎన్నికల సమయంలో హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక మర్చిపోయే నాయకుల శకం అయిపోయింది. గతంలో వ్యవసాయం దండగ అంటూ కూడు పెట్టే రైతుల కడుపుకొట్టారు. పచ్చని పంటను పండిస్తే నేలమట్టం చేశారు. నష్టపోతే పట్టించుకున్న పాపానపోలేదు. మంచి దిగుబడి ఉంటే ధరల విషయంలో దగా చేశారు. బాగా పండినా, పండకపోయినా రైతులను ఏదోరకంగా అప్పుల పాలు చేసి నడిరోడ్డుపై తోసేసిన దళారుల రాజ్యానికి కాలం చెల్లింది. అప్పట్లో ప్రకృతి కూడా సహకరించడం లేదంటే, ఆ నాయకుడి నైజం దేవుడికి ఎరుక. అందుకే గ్రామంలోకి ఎరువులు, విత్తనాలు తెచ్చిచ్చే నాయకులే మాకు కావాలి. వ్యవసాయాన్ని దండగ అన్న కాలం నుంచి వ్యవసాయాన్ని పండుగలా మార్చే నాయకుడిని ఎన్నుకుంటాం. మంచి నాయకుడు వస్తేనే వర్షం సమృద్ధిగా కురుస్తుంది. పంటలు పండుతాయి. రైతులను బతికించే నాయకుడు పాలిస్తే కరువు కాటకాలు కొట్టుకుపోతాయి. అందుకే వ్యవసాయానికి భరోసా ఇచ్చే వారినే గెలిపించుకుంటాం... అంటోంది రైతులోకం.

మోసగాళ్లకు కాలం చెల్లింది



ఎన్నికల సమయంలో వచ్చి హామీలిచ్చి మర్చిపోయే మోసగాల్లకు కాలం చెల్లింది. రైతులను ఆదుకుంటామంటూ ముందుకు వచ్చే నాయకుడు కావాలి. రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. అలాంటి వారిని ఎన్నుకుంటేనే రైతు జీవనం సాగించగలడు. ఆర్థికంగా ఎంతో కొంత ఊతమిచ్చే నాయకులనే గెలిపించుకుంటాం.

–రామక్రిష్ణారెడ్డి, వసంతాపురం, గుడిపాల

సౌకర్యాలు కల్పించాలి



రైతులకు ఉన్న ఊర్లోనే సాగుకు అవసరమైన సదుపాయాలు కల్పించే నాయకుడే మాకు అవసరం. గతంలో మాదిరిగా ఎరువులు, విత్తనాల కోసం క్యూలో నిల్చుని లాఠీలతో దెబ్బలు తినే పరిస్థితి రైతులకు మళ్లీ రాకూడదు. వ్యవసాయానికి, రైతులకు అన్ని రకాలుగా అండగా నిలిచే నాయకులకే ఈ ఎన్నికల్లో ఓటేసి గెలిపించుకుంటాం.

– శివకుమార్, నరహరిపేట, గుడిపాల

మంచి చేసే వారినే ఆదరిస్తాం



రైతులతో రాజకీయం చేసే నాయకులు మట్టికొట్టుకుపోయారు. రైతులను మోసం చేసే వారికి ఓటమి తప్పదు. అలవికాని హామీలిచ్చి ఓట్లు దండుకునే దగా కోరు రాజకీయాల శకం ముగిసిపోయింది. అన్నం పెట్టే రైతన్నకు మేలు చేసే వారికే ఓటేస్తాం. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చే నాయకుడిని ఆదరించి గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నాం.

– రాజేష్, చిత్తూరు

రైతు బాంధవుడికే ఓటు



దేశానికి రైతే వెన్నెముక అని చాలా మంది అంటారు. ఇది నిజం చేసే నాయకుడే మాకు కావాలి. వ్యవసాయాన్ని పండుగలా మార్చే రైతు బాంధవుడిని గుండెల్లో పెట్టుకుంటాం. గతంలో క్రాప్ హాలిడే ప్రకటించిన నాయకులకు విశ్రాంతి తీసుకునే సమయం ఆసన్నమైంది. రైతులకు వెన్నుదన్నుగా నిలిచే నాయకుడిని గెలిపించుకుంటాం.

–చంద్రారెడ్డి, టి.పుత్తూరు, తవణంపల్లె

భరోసా ఇచ్చే వారికే ఓట్లు



వ్యవసాయ రంగానికి అండగా నిలిచి, రైతన్నల అభ్యున్నతికి పాటుపడే నాయకుడే కావాలి. అబద్ధాలు చెబుతూ, మోసాలు చేసే నాయకులెవరో అందరికీ తెలిసిపోయింది. మాఫీ పేరుతో అన్నదాతలను వీధుల్లోకి లాగినవాళ్లకు బుద్ధి చెబుతాం. రైతుల కన్నీళ్లు తుడుస్తూ, అన్నదాతలకు భరోసా ఇచ్చే నాయకులకే ఓటు వేస్తాం.

–దామోదర్ రెడ్డి, పాలేరు, బంగారుపాళెం

సాగుకు భరోసా ఇవ్వాలి



వ్యవసాయానికి అన్ని విధాలా భరోసా ఇచ్చే నాయకుడే కావాలి. సాగుకు పెట్టుబడి నిధులు అందించి ఆదుకునే నాయకుడే మాకు అవసరం. ఎన్నికల సమయంలో వరాలిచ్చి, గద్దెనెక్కాక మాటమార్చే నాయకులనూ గతంలో చూశాం. వరుణ దేవుడు కరుణించే మంచి నాయకుడిని గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నాం.

–వెంకిరెడ్డి, చింతగుంటూరు, గుడిపాల

మేలు చేస్తే మర్చిపోం



ప్రతి ఏటా పంట పండించుకునే రైతులకు అండగా నిలబడే నాయకులను మేం ఎప్పటికీ మర్చిపోం. అలాంటి మేలు చేసే నాయకులను గెలిపించుకోవడానికి మేమంతా సిద్ధంగా ఉన్నాం. ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చి బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక మరిచిపోయే నాయకులకు తగిన రీతిలో బుద్ధి చెబుతాం.

–మనోహర్‌రెడ్డి, మరకాలకుప్పం, గుడిపాల

ప్రకృతి కూడా కాటేస్తుంది



వ్యవసాయాన్ని దండగ అన్న నాయకుడి పేరు వింటేనే వణుకొచ్చేస్తోంది. రైతులే కాదు..వానదేవుడికీ భయమే. పశువులు తాగడానికి కూడా నీళ్లు దొరకవు. అలాంటి పరిస్థితి తెచ్చుకోవాలని ఎవరూ అనుకోరు. ప్రకృతి కూడా మంచి చేసిన నాయకుల వైపే ఉంటుంది. తన పాలనలో రైతులందరికీ మంచి చేసే నాయకుడిని ఈ ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదిస్తాం.

– దాము, చిత్తూరు

దండగ నేతకు బుద్ధి చెబుతాం



వ్యవసాయం దండగ అంటూ రాష్ట్రంలో రైతులకు విలువ లేకుండా చేసిన నేతలకు బుద్ధి చెబుతాం. అన్నదాతలకు విత్తు నుంచి విక్రయం వరకూ అన్నింటినీ అందుబాటులోకి తీసుకొచ్చే నాయకుడిని ముఖ్యమంత్రిగా చేసుకుంటాం. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని ఆలోచించే నాయకుడికే మా మద్దతు ఉంటుంది.

–రంగనాథశెట్టి, ఐరాల మండలం

మాట తప్పనివారికే నా ఓటు



కష్టకాలంలో రైతులను ఆదుకునే నాయకుడికే ఓటేస్తాం. రైతులకు రుణ మాఫీ చేస్తామంటూ గెలిచాక అడ్డం తిరిగిన నాయకులను చూశాం. రైతులను హేళనగా మాట్లాడిన ప్రభుత్వాన్ని చూశాం. రైతునే రాజుగా భావించి, ఇంటి వద్దకే సకల సదుపాయాలను సమకూర్చే నాయకులను మాత్రమే ఈసారి గెలిపించుకుంటాం.

–జయరామిరెడ్డి, నడింపల్లి గ్రామం, పూతలపట్టు

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దకే మెరుగైన వైద్యం

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని వారికి ఇంటివద్దే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని సవటపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రజలకు ఎంతో ఉపయోగకరమన్నారు. ప్రతి నెలా వైద్య బృందం గ్రామానికి విచ్చేసి రోజంతా గ్రామంలోనే వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజిషియన్‌తో ఇంటివద్దకే వైద్యం

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ విధానంతో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని బొమ్మసముద్రం వైద్యాధికారి డాక్టర్ రష్మిత అన్నారు. మండలంలోని పేయనపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 65 మంది గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఇంటి వద్దనే ఆరోగ్య సేవలను అందించారు. వైద్య సిబ్బంది శ్రీలక్ష్మి, కవిత, స్వర్ణ, కార్లినమ్మ పాల్గొన్నారు.

35 మందికి వైద్య సేవలు

తవణంపల్లె: మండలంలోని పట్రపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు 35 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తర్వాత గర్భిణులు, బాలింతలకు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో వైద్య బృందం, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లకిలో శ్రీరాముడు

చిత్తూరు రూరల్: శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చిత్తూరు నగరం శ్రీకోదండరామస్వామి ఆలయంలోని స్వామివారు శుక్రవారం పల్లకిలో కనువిందు చేశారు. ఉదయం మూలస్థానంలోని స్వామివారికి అభిషేక పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించి అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం మోహిని అలంకారంలో స్వామి వారిని అలంకరించి పల్లకి ఉత్సవంలో ఊరేగించారు. రాత్రి యాళి వాహనంలో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. భక్తులు హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని రాములవారి తేరు ఊరేగింపు సందర్భంగా ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 7 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని చెప్పారు. మార్కెట్ వీధి, చర్చివీధి, గాంధీరోడ్డు, డీఐ రోడ్డు, జెండామానువీధి, బజార్‌వీధి, బ్రాహ్మణవీధి, హైరోడ్డు, పొనియమ్మన్‌గుడివీధి, వేపమానువీధి, కయినికట్టువీధి, తేనెబండ, దర్గామిట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

టీడీపీది పూటకో మాట



రాజరత్నంరెడ్డి

చిత్తూరు రూరల్: టీడీపీది పూటకోమాట అని ప్రజాహిత సేవా సంస్థ అధ్యక్షులు రాజరత్నంరెడ్డి విమర్శించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గెలుపు కోసం సిద్ధాంతాలు వదిలి, ఇతర పార్టీలతో అనైతిక పొత్తు పెట్టుకుందని విమర్శించారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చి, పేద, బడుగు వర్గాల ఉన్నతికి అహర్నిశలు శ్రమిస్తూ, సుపరిపాలన సాగిస్తున్న వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ గెలిపించాలని ఆయన కోరారు.

వేడుకగా వార్షికోత్సవం



చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలోని విజ్ఞానతేజ స్కూల్‌లో శుక్రవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పిల్లలకు ఆటపోటీలు నిర్వహించారు. రాత్రి పిల్లలు నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు వైస్ ఎంపీపీ రంజని, కుమార్, ప్రసాద్, లోకేష్‌రెడ్డి, జయశంకర్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హనుమంతుడిపై సీతారాములు



తవణంపల్లె: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శ్రీ కోదండ రామస్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి హనుమంతుడి వాహనంపై సీతారాములు విహరించి భక్తులను కనువిందు చేశారు. ఉదయం పచ్చనిపందిరిలో సీతారాములు కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.